# ప్రకృతి ప్రబోధించింది!

* టి. డి. ప్రసాదరావు *

★

ప్రక్కింటి రేడియోలోంచి వార్తలు గాని పాటలుగాని వినరావడంలేదు. దానికి మరామత్తు వచ్చిఉండాలి. కిటికీ తెరలోంచి అరమోడ్పు కనులతో రోడ్డుమీద పోయేవారిని దినమూ చూస్తున్న యెదురింటి అమ్మాయి మధురదృశ్యం ఈవాళ కనిపించలేదు. చూడడానికి విసుకెత్తిందేమో ఆమెకు. లేకపోతే వంట్లో బాగులేక పోవచ్చు. వీధిమలుపులో ఉన్న కాఫీహోటలు తలుపులు బంధించిఉన్నాయి. ఆదివారంకాబోలు. ముస్తాబుతో ముద్దులొలుకుతూ సరదాగా మెరపు చూపులతో ఎదురుగా వస్తూంది. ఒక ఆధునిక యువతి, యెక్కడో యింతకుముందు చూచినట్లు జ్ఞాపకం. ఎక్కడో? ఎప్పుడో?

తను చూచే ప్రపంచంలో యీ చిన్నమార్పులే యెంతో కలవరపెడుతున్నాయి ప్రకాశాన్ని. వికారంగా యేదో కోర్కె అతని హృదయాన్ని కలతపెడుతూంది, ఏమిటది అంటే చెప్పలేడు. వినోదమంటే విసుక్కొనే ప్రకాశానికి విశాలమంత వినోదకరమైన ఈ మహానగరంలో కనిపించే ఉత్సాహ ఉద్రేకపూరితమైన భంగిమలన్నీ అయోమయంగా ఉన్నాయి, అర్థంలేని పాటలాగు.

ఇంతకుముందల్లా వెగటుగా తోచినవన్నీ ఈవాళెంతో మనోహరంగా ఉన్నాయి. యువతీ యువకులు జంటలుగా పోతూంటే యెంతో ఆనందంగా ఉంది చూడడానికి. ప్రపంచానికి యెంత అందం, ఆనందం, ఆహ్లాదం వాళ్లు కలగజేస్తున్నారు? తెలియకుండానే వాళ్లెంత ఆదర్శప్రాయులవుతున్నారు అని అనుకున్నాడు. అసహ్యించుకొనే ఆ దృశ్యాలే ఈనాడు అతనికెంతో యింపుగా సొంపుగా కనిపిస్తున్నాయి.

ప్రపంచమంటే స్త్రీ పురుష సమ్మేళనగా, అందమైన స్త్రీయే దేవతలాగు కనిపిస్తుంది. ఎంత కురూపిని చూచినా ఈవాళ ప్రకాశానికి యే చిత్రంలోనో చూపించిన అసమాన సౌందర్య ప్రతిమలాగు పొడగడుతూంది. కళ్లు మూయకుండా చూస్తున్నాడు.

ప్రపంచమే పరమ ప్రసాదంగా గ్రహించి, అది అందిచ్చే ఆనందాన్ని అనుభవిస్తూ, ఉత్సాహంగా జీవితయాత్ర చేస్తున్న స్త్రీ పురుషులే మార్గదర్శకులనే సిద్ధాంతాన్ని స్వీకరిద్దామా అని ప్రశ్నించుకున్నాడు. ప్రపంచంమీద ఉండే అన్యాయం, అనుమానం, నిరసనం యివన్నీ తన జీవితాన్ని విషాదకరం చేస్తున్నాయని తలంచాడు. అందం, ప్రేమ, ప్రణయం ఒక్క కావ్యాలలోను కథలలోనే కాకుండా నిజంగా మానవ జీవితంలోకూడా ఉన్నాయంటే నమ్మచ్చునను కున్నాడు. వయసులో ఉన్న తనుకూడా యెందుకు ఆనందాన్ని ఆస్వాదించకూడదు? అనే పెద్ద ప్రశ్న గుండెకాయ గజగజ వణికించింది. విప్లవశక్తులు ఆవేశిస్తున్నాయి. నిన్నటి ప్రవర్తనకు ఈవాళ్టి చైతన్యానికి యెంత నరక వైకుంఠ భేదముందో అతనిలో.

కనకవల్లి తన జీవితంలో కల్పతరువులాగు తన పవిత్రప్రేమ ధారబోసే ఆశతో అన్నమాటలు చెవులలో ప్రతిధ్వనించాయి: "ప్రకాశం. నీవెంతో తెలివైనవాడవు. బాగా చదువుకున్న వాడవుకూడాను. కాని నీలో సనాతన సాంప్రదాయ భావాలు పోలేదు. మారిపోతున్న ప్రపంచంలో మరచిపోయే ధర్మాల్ని పోషిస్తానంటావు. బాగా ప్రపంచాన్ని పరీక్షచేసిచూడు. సాంప్రదాయం అనేపేరిట సంఘంలో జరుగుతున్న

అన్యాయాలు అవమానాలు సహిస్తుంటే నీవు కూడా వాటిని నిర్మూలించడానికి కంకణం కట్టుకుంటావు సంఘానికి హృదయం లేకపోతే నీకు లేదా? వాటిని అర్థంచేసుకుంటే నీ హృదయం కూడా చలించితీరుతుంది, ధైర్యం, స్థైర్యం, పట్టుదల నీలోకూడా ఆవేశిస్తాయి. నీకూ సంఘం కల్పించిన కట్లు త్రెంచే బలము కలుగుతుంది, నీతి, నియమం అనే పేరిట అవినీతిని ప్రేరేపిస్తుంది సంఘం. ఇంతకూ నేను చేసిన తప్పేమిటి? నిన్నెందుకు మీరంతా అతి హీనంగా, నీచంగా, నికృష్టంగా, నిరసనగా చూడడం నా తండ్రి వద్ద నేను చెప్పలేనదేమిటి? అదే నా నేను చేసిన తప్పు పాపమైనా అందుకే నీ నా నేనీ క్రూర అవమాన బాధను అనుభవిస్తుండగా, నీవుకూడా నన్నింత నీరసంగా చులకనగా చూడడం భరించలేను. నా లాంటి బాధపడే ఒక జీవిని కాపాడే శక్తి నీలో లేకపోవడం నను అధోగతి పాలవడానికే..., యింకా..." వణికే స్వరంతోపాటు కనకవల్లి కళ్ళు సలంకరించాయి కన్నీటి బిందువులు ఆమె అసహాయత నిస్సత్తువ ప్రకాశిస్తూ.

ప్రకాశం మాత్రం యేమీ చలించలేదు. అక స్మాత్తుగా యిప్పటికీ ఆ రాయిగుండె కలిగి నిలపుతోంది, ఆ మాటలు ఆ దృశ్యాన్ని తలంచుకున్న మాత్రాన అతని కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. జనసమూహంతో కలకిలలాడుతూ మహానంద డోలికలలో తూగాడుతున్న ఆ నడుబజారులో తన దుఃఖావేశను ఎవరైనా గమనిస్తారేమో అనే సిగ్గు, చిన్నతనంచేత కంట్లో యేదో నలక పడినట్లు నటించి, ఆ అశ్రుబిందువులను అద్దుకుంటున్నాడు చేతి రుమాలుతో.

ఆ జన మధ్యాన్న నిలుచోని వారి ఆనందాన్ని పాల్గొనడానికి ప్రకాశానికి బలం లేకపోయింది ప్రక్కనే ఉన్న పార్కు చేరి, చతికిలబడ్డాడు. ఆ తోటలోని పూలచెట్లు, తీగెలు, లతలు, పూలు అన్నీ యెంతో ఆనందంగా క్షణకాలమైన తమ జీవితాన్ని గడిపేస్తున్నట్టుగా కనిపించాయి. వాటి మధ్యను కూర్చోడానికికూడా ప్రకాశానికి శక్తి లేకపోయింది. మానవులతో మాటాడే శక్తి లేకపోయినా, ప్రకృతికి బుద్ధిచెప్పే విజ్ఞానశక్తి లేకపోలేదు గాబోలు: కనకవల్లి, ఆమె అశ్రుపూరిత అమాయకపు కళ్ళు, తెరగా అడ్డువచ్చిన తన కన్నీటిలోంచి కనిపిస్తున్నాయి ప్రకాశానికి "నగ్నంగా హృదయాన్ని విప్పిచెప్పిన, కనకవల్లి నిజంగా పవిత్ర ప్రణయమూర్తి, పోయి ఆమెను చేరు" అని ప్రకృతి ప్రబోధించింది మౌనంలోనే. నిశ్చలమైనా నిర్మలత్వంగల ప్రకృతి ప్రబోధశక్తికి పూర్తిగా మారిపోయాడు ప్రకాశం. పశ్చాత్తాపం కలిగింది ఎవరైనా సరే కనకవల్లినే వివాహమాడి ఆమె జీవితం ఆనందభరితంగా చేయడమే తన విధి అని నిశ్చయించుకున్నాడు.

ఉద్రేకంతో బలమొచ్చింది కాబోలు. లేచి బయలుదేరాడు. అమ్మా నాన్నల ఆశయాలు, ఆశలు, స్నేహితుల పరిహాసాలు, తదితరులు ఆడిపోసే మాటలు అగ్నిజ్వాలలలాగు అడ్డొస్తున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఇంతలోనే కనకవల్లి కన్నీటి బిందువులు వాహినులుగా, ప్రవాహాలుగా వచ్చి ఆ అగ్నిశిఖలను ఆర్పేస్తున్నాయి.

మొదటి చూపులలోనే మోహించి, గట్లు తెగి ప్రవహించే ప్రణయవాహిని నరికట్టలేక తికమకలాడే నవనాగరిక కాముకుని కృత్రిమ ప్రేమకన్నా పరమావధిని గ్రహించి ప్రేమబలము నెరింగిన ప్రకాశిదే ఉత్తమమైనది గాబోలు.


బహుమానము రు.500

ఒక అద్భుతమైన సృష్టి

మాజిక్ ఉంగరం

మాజిక్, మెస్మరిజమ్ ప్రభావమువల్ల తయారుచేయబడిన ఈ ఉంగరము దుష్ట గ్రహబాధ లేకుండచేయుటలో అసమానమైనది. దీనిని ధరించినవారికి సమస్త మనోవాంఛలు చేకూరును. ప్రణయము, వ్యాజ్యము, ఆరోగ్యము, ఐశ్వర్యము మొదలగు విషయములలో విజయము నిచ్చును. ఒక్కరాత్రి ధరించిన ఈ మేజిక్ రింగు అద్భుతశక్తి తెలియును.

ఉంగరము ఒకింటికి రు. 2/-

మూడు ఉంగరములు రు. 5/-

ప్యాకింగు, తపాల ఖర్చులు అదనము.

మహాకాళి ఆశ్రమం

నెం. 247, కాన్పూరు.

**MAHAKALI ASHRAM**

No. 247, Kanpur.